క్లుప్తంగా

సీఐ, ఎస్సైకి సన్మానం



చెన్నారావుపేట : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధుల్లో చేరిన సందర్భంగా సీఐ చంద్రమోహన్, ఎస్సై అరుణ్‌కుమార్‌లను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలోని బృందం, బీఆర్ఎస్ నాయకులు మంగళవారం వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లపెల్లి నర్సయ్యగౌడ్, రమేశ్, రాజేందర్, రాజు, అశోక్, ఓదేలు, కుమారస్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా శేఖర్‌రావు



వర్ధన్నపేట: కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధిగా వరంగల్ నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది నిమ్మాని శేఖర్‌రావును నియమించినట్లు స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 35 ఏళ్లుగా పార్టీలో సేవలు అందిస్తున్న క్రమంలోనే పదవిని కట్టబెట్టినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి శేఖర్‌రావు సేవలు మరింత అవసరమని భావిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా శేఖర్‌రావు మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి పాటుపడతానని తెలిపారు. తనకు పదవి కట్టబెట్టిన ఎమ్మెల్యే నాగరాజుకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

నెక్కొండ : నేడు (బుధవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమగ్ర నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

నేడు బీఆర్ఎస్ విస్తృతస్థాయి..

రాయపర్తి : నేడు (బుధవారం) మండల కేంద్రంలోని కుందూరు కృష్ణారెడ్డి దొడ్డిలో బీఆర్ఎస్ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్ తెలిపారు. మండల కేంద్రంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. సమావేశానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రేపు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ధర్నా

గీసుకొండ : వరంగల్ నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట రేపు (ఈనెల 7న) ఉదయం 10 గంటలకు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ధర్నా నిర్వహిస్తామని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నర్సింహ, రామా రాజేశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఇతర అనేక సమస్యలు పరిష్కరించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, పీఆర్సీ, ఏరియర్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

'వయో పరిమితి పెంచాలి'

వర్ధన్నపేట : మెగా డీఎస్సీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ అభ్యర్థులకు వయో పరిమితిని మరో మూడేళ్లు పెంచాలని సామాజిక కార్యకర్త బంక మాణిక్యం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వయో పరిమితి 46 ఏళ్లుగా కాగా ప్రభుత్వం ఐదేళ్లు పెంచి 56 ఏళ్లు చేసిందని పేర్కొన్నారు. వేలాది మంది నిరుద్యోగ యువత అనేక ఏళ్లుగా ఎమ్మెస్సీ, ఎంఈడీ, బీఈడీ పూర్తి చేసినా వయస్సుతో అవకాశాలు చేజారిపోయాయని తెలిపారు. మరో మూడేళ్లు పెంచి నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు.

'పూసపల్లి కుట్ర కేసు ఎత్తివేయాలి'

వర్ధన్నపేట : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్, వరంగల్ జిల్లా కార్యదర్శి గోపన్న, జిల్లా నాయకులు ఎస్కే.మదార్, సురేశ్‌లపై బనాయించిన పూజపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామిక పాలన చేస్తామని వాగ్దానం చేసినా అందుకు భిన్నంగా ఫిబ్రవరి 14న పార్టీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసినట్టు తెలిపారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు మొగిలి ప్రతాపరెడ్డి, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్‌తోపాటు మొత్తం 24 మందిపై అక్రమంగా కేసు బనాయించారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.

మహిళలకు ఆర్థిక స్వాతంత్య్రం ముఖ్యం

● నర్సంపేట సివిల్ కోర్టు జడ్జి శిరీష



సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నర్సంపేట : మహిళలకు ఆర్థిక స్వాతంత్య్రం ముఖ్యమని స్థానిక సివిల్ కోర్టు జడ్జి పి.శిరీష తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సాధికారత సెల్ కన్వీనర్ డాక్టర్ టి.సుమతి ప్రారంభించగా ముఖ్యఅతిథిగా జడ్జి శిరీష హాజరై మాట్లాడారు. విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. నేరాల జోలికి పోవద్దన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలు పెంచుకుంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి లెక్చరర్లు ప్రోత్సహించాలని సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన డాక్టర్ ఎల్.విద్య మాట్లాడుతూ విద్యారంగంలో మహిళల పాత్ర క్రమంగా పెరుగుతోందని తెలిపారు. మరో అతిథిగా హాజరై కాకతీయ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మల్లం పద్మ మాట్లాడుతూ విద్యార్థినులు ఉన్నతులుగా ఎదిగే దిశగా సాగాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదువుకుని సమాజానికి మార్గదర్శకం కావాలని ఆకాంక్షించారు. మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని తెలిపారు. అనంతరం కళాశాల పొలిటికల్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మామిడాల శైలజ రచించిన 'గతి తప్పిన రుతువు' నవలను, బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని హర్షిణి రచించిన 'డ్రీమింగ్ ఆఫ్ హోమ్' కవిత సంకలనాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, కవిత రచన, పోస్టర్ ప్రెజెంటేషన్, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. తదనంతరం అతిథులను ప్రిన్సిపాల్ మల్లం నవీన్, సాధికారత సెల్ సభ్యులు డాక్టర్ టి.సుమతి, డాక్టర్ జి.ప్రసూన, ఎం.శైలజ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత సెల్ సభ్యులు ఎస్.స్వరూపరాణి, షాహీన్ సుల్తానా, లావణ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనాథ్, తోట రమేశ్, సత్యనారాయణ, డాక్టర్ విష్ణుకుమార్, డాక్టర్ శివనాగ శ్రీను, డాక్టర్ లకన్‌సింగ్, నరేందర్, డాక్టర్ పూర్ణచందర్, సమ్మయ్య, డాక్టర్ రమేశ్, డాక్టర్ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



చెన్నారావుపేట : విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చెన్నారావుపేట : ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నిర్వహించిన పోటీల్లో ఉప్పరపల్లి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు హెచ్‌ఎం జయ తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో మంగళవారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వారం ఆన్‌లైన్‌లో ఆర్‌బీఐ వ్యాసరచన, నినాదాలు, పోస్టర్ విభాగాల్లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించిందని పేర్కొన్నారు. 'రాత్రికి రాత్రే నేను మిలియనీర్‌గా మారితే ఆ డబ్బును ఎలా ఉపయోగిస్తా?' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని ఆర్.కీర్తన విజేతగా నిలిచి రూ.2000 నగదుతోపాటు ప్రశంసపత్రం అందుకుందని తెలిపారు. ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు మాధవి గైడ్ టీచర్‌గా వ్యవహరించిందని తెలిపారు. 'సేవింగ్ అండ్ పవర్ ఆఫ్ కాంపౌండింగ్' అంశంపై నిర్వహించిన నినాదాల పోటీల్లో వెల్దె ఆకాష్ విజేతగా నిలిచి రూ.2 వేల నగదుతోపాటు ప్రశంసపత్రం అందుకోనున్నట్లు తెలిపారు. గైడ్ టీచర్‌గా తెలుగు ఉపాధ్యాయురాలు వేముల మమత వ్యవహరించారన్నారు. ఉపాధ్యాయులు సునీత, శశిధర్, సంతోష్‌కుమార్, బాలాజీరావు, ఉదయ్‌కుమార్, సీహెచ్.మాధవి, సుందర్, మురళి, రవీందర్, మోహన్‌రావు, కృష్ణ, రమేష్, జాహేద్, చింతకింది ఇందిర తదితరులు విద్యార్థులు, గైడ్ టీచర్లను అభినందించారు.

పాఠశాల విద్యార్థిని ధరణి..

దుగ్గొండి : ఆర్‌బీఐ నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ధరణి ప్రతిభ కనబరిచి రూ.2000 నగదు బహుమతి అందుకున్నట్లు హెచ్‌ఎం రామస్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ధరణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరభద్రయ్య, సుశీల, జనార్దన్, అజీజ్ పాల్గొన్నారు.

గ్రామదేవతలకు పూజలు



రాయపర్తి : మండలంలోని కిష్టాపురం, వాంకుడోతుతండాలకు చెందిన తోట విమల, మాజీ సర్పంచ్ కునుసోతు సరిత, డాక్టర్ హరీశ్, గిద్దె మహిపాల్, వాంకుడోతు ఉపేందర్ గ్రామస్తులతో కలిసి గ్రామదేవతలకు మంగళవారం పూజ చేశారు. అనంతరం వారు అయోధ్యలోని రామమందిర దర్శనానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో అనుముల యాదయ్య, కునుసోతు సజ్జన్, తోట సోమ నర్సయ్య, వల్లపు లచ్చయ్య, చందు విష్ణుమూర్తి, కత్తి కుమారస్వామి, కునుసోతు శ్రీను, వల్లపు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంహెచ్‌డీ కమిటీ ఎన్నిక



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్‌లోని మొగిలిచర్లలో మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దండోరా జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడుగా గనిపాక అరుణ్, ఉపాధ్యక్షుడుగా ఐత రంజిత్, కార్యదర్శులుగా ఆకులపెల్లి పరంజ్యోతి, జన్ను లెనిన్, గనిపాక ప్రకాశ్, మాచర్ల నిఖిల్, ల్యాదల్ల ఉదయ్‌కుమార్, సోషల్ మీడియా కన్వీనర్‌గా పొలెపాక శివ, సంయుక్త కార్యదర్శిగా ఎల్లందుల సర్దార్‌తోపాటు మరో 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్టు తెలిపారు. అలాగే 15వ డివిజన్ కమిటీ అధ్యక్షుడుగా గనిపాక దయాకర్‌ను నియమించినట్లు ప్రకటించారు.

విద్యతోనే జీవితంలో ఉన్నతి



విజేతలైన విద్యార్థులతో ఎంపీపీ అప్పారావు, చైర్‌పర్సన్ అరుణ, విద్యాసంస్థల చైర్మన్ నరేందర్

వర్ధన్నపేట : చదువుకోవడం ద్వారానే జీవితంలో ఉన్నతి సాధించగలరని ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ తెలిపారు. పట్టణంలోని ఆల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ఆ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా అప్పారావు, అరుణ ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేలా క్రమశిక్షణ కూడిన విద్యాబోధన అందించాలని సూచించారు. విద్యార్థులకు కళలపై అవగాహన పెంచాలని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. విద్యాసంస్థ చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన 'చిన్ని చిన్ని ఆశ..', 'ఛలో..ఛలో వచ్చిందమ్మా...ఆనందం తెచ్చిందమ్మా', 'స్నేహితుడా.. ఓ స్నేహితుడా', 'ఓయ్ బాటసారి...చూద్దామా' ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పరామర్శ



దుగ్గొండి : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన పొగాకు సమ్మయ్యను గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సందర్భంగా మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. ప్రభుత్వం గీత కార్మికులకు ఆర్నెల్లుగా ఎక్స్‌గ్రేషియా చెల్లించడం లేదన్నారు. ఎన్నికల హామీ మేరకు గీత కార్మికులకు వెంటనే పెండింగ్ ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు సేఫ్టీ మోకులు, మోపెడ్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపగాని వెంకట్, తోటకూరి రాందాస్, ముంజాల రాజేందర్, పెరుమాండ్ల శ్రీరామ్, బొడిగె భద్రసేన, మద్దెల సాంబయ్య, పొగాకు రాజు పాల్గొన్నారు.

నేటి 'నారీ శక్తి వందన్'కు ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కుమారస్వామి, నాయకులు

వర్ధన్నపేట : నేడు (బుధవారం) ఉదయం 10 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ తలపెట్టిన 'నారీ శక్తి వందన్' కార్యక్రమాన్ని వీక్షించేలా పట్టణంలోని ఎంఎంఆర్ ఫంక్షన్ హాలులో ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం నిర్వహిస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి, పట్టణ అధ్యక్షుడు చీటూరి రాజు తెలిపారు. ఆ ఫంక్షన్ హాలును మంగళవారం వారు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించిందని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న మహిళలతో ప్రధాని ప్రత్యక్షంగా మాట్లాడతారని చెప్పారు. ఫంక్షన్ హాలులో టీవీ ద్వారా ప్రధాని మోదీ కార్యక్రమాన్ని తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. మహిళలు, అభిమానులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాంపెల్లి యాకయ్య, పెద్దూరి రాజు, కొండేటి సత్యం, మంద అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ తనిఖీ

దామెర : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ నారాయణ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధరణి పెండింగ్ ఫైళ్లను పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, డీటీ యూసుఫ్ ఖురేషి, ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భ్రూణహత్యల నిర్మూలనకు కృషి చేయండి



మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

దామెర : భ్రూణహత్యల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ భాగ్యలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బేటీ బచావో బేటీ పడావో, సఖీసెంటర్, బ్రూణ హత్యల నిర్మూలన, టోల్‌ఫ్రీ నంబర్ 181, మహిళలకు సంబంధించిన రక్ష, ఉపాధి, విద్య, కౌన్సెలింగ్, న్యాయ సాయంతో పాటు వివిధ రకాల సమస్యలు, వాటి పరిష్కారాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాణి, మంజుల, జిల్లా సాధికారత మిషన్ లావణ్య, ఏపీఓ శారద, జెడ్పీటీసీ కల్పన కృష్ణమూర్తి, ఎంపీపీ శంకర్, వైస్ ఎంపీపీ జాకిరాలి, ఎంపీటీసీ రామకృష్ణ, సోషల్ వర్కర్ మంజుల, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ వినియోగించుకోవాలి

ఖిలా వరంగల్: పలు రకాల కేసుల్లో సీజ్ చేయబడిన వాహనాలను ఈనెల 4 నుంచి 16 వరకు వరంగల్ జిల్లా సెకండ్ క్లాస్‌కోర్టులో జరుగుతున్న లోక్ అదాలత్‌కు సరైన ఆధారాలతో కోర్టుకు హాజరైతే సులభంగా వాహనాన్ని తీసుకెళ్లే అవకాశాన్ని పోలీసులు ఏర్పాటు చేశారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వారైతే అధార్ కార్డు జిరాక్స్, వాహన ధ్రువీకరణ పత్రాలతో కోర్టుకు హాజరు కావాల్సి ఉంటోంది. డ్రైవింగ్ లైసెన్సు కేసు నమోదైతే అధార్ కార్డు, మీసేవలో డ్రైవింగ్ లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్న స్లాట్ రశీదు తీసుకుని కోర్టుకు హాజరవ్వాలి. మైనర్ డ్రైవింగ్ కేసులో జన్మదిన ధ్రువీకరణ పత్రం, ఎస్ఎస్‌సీ మెమో వెంట తీసుకుని కోర్టుకు హాజరైతే ప్రతి కేసును లోక్ అదాలత్‌లో తక్కువ జరిమానా విధించి పలు రకాల కేసులను క్లోజ్ చేసి సీజ్ చేసిన వాహనాలను వాహనచోదకులు అప్పగిస్తారు.

8న శివపార్వతుల కల్యాణం

ఖిలావరంగల్: ఈనెల 8న వరంగల్ నగర శివారులోని శంభునిపేట విశ్వనాథ కాలనీలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు రవీందర్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి గంగు సతీష్‌శర్మ, ఆలయ చైర్మన్ కర్నె రవీందర్ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై శివపార్వతుల కల్యాణాన్ని తిలకించాలని కోరారు. కార్యక్రమంలో సమ్మయ్య, నాగరాజు, రాజేష్‌కుమార్, దేవేందర్, సంజు తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్‌లో కార్పొరేటర్ చేరిక

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జీ దీపదాస్ మున్షీ ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు, విక్టర్ తదితరులున్నారు.

ఇష్టంతో చదివితే మెరుగైన ఫలితాలు

● కేజీబీవీలో ఏఎంఓ సారయ్య తనిఖీ



పరీక్షను పరిశీలిస్తున్న ఏఎంఓ సారయ్య

సంగెం : విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితే మెరుగైన ఫలితాలు వస్తాయని అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) మాలోత్ సారయ్య స్పష్టం చేశారు. మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ)ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గణిత పరీక్షను, మధ్యాహ్న భోజనాన్ని, హాస్టల్‌లోని కూరగాయలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులందరూ ప్రణాళికాయుతంగా చదువుకుని వార్షిక పరీక్షల్లో 10 జీపీఏ సాధించాలని సూచించారు. పరీక్షల పట్ల భయాందోళనలు వీడి ప్రశాంతంగా చదవాలని చెప్పారు.

మాక్ పోలింగ్

కేజీబీవీలో మాక్‌పోలింగ్ నిర్వహించారు. విద్యార్థినులు పీఓ, ఏపీఓ, ఓపీఓలుగా విధులు నిర్వహించి ఓటు వేసే విధానాన్ని కళ్లకు కట్టారు. ఎంపీపీ కళావతి, ఎస్ఓ నీలిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



దయాకర్‌రావును సన్మానిస్తున్న గ్రామస్తులు

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. మండలంలోని ఆరెగూడెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన దుర్గమ్మ పండుగకు ఆయన హాజరై ప్రజలు పూజలు చేసి మాట్లాడారు. దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలోని ప్రతీఒక్కరు దైవ సన్నిధిని కోరుకోవాలని సూచించారు. పండగలను ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. దుర్గమ్మ పండగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దయాకర్‌రావును గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, యాకయ్య, నర్మద తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నరహరి, సభ్యులు

సంగెం : మండల కేంద్రంలోని గంగాభవాని సమేత సంఘమేశ్వరాలయంలో ఈనెల 8వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కందకట్ల నరహరి కోరారు. ఆలయంలో బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను మంగళవారం నాయకులతో కలిసి ఆన ఆవిష్కరించి మాట్లాడారు. 8వ తేదిన మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు ఉంటాయని చెప్పారు. అదే రోజు రాత్రి 1.03 గంటలకు శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఆగపాటి రాజు, ఉపాధ్యక్షులు మునుకుంట్ల కోటేశ్వర్, కక్కెర్ల శరత్, గుండేటి రాజ్‌కుమార్, సభ్యులు గుండేటి బాబు, మెట్టుపల్లి రమేశ్, కోదూరి సదయ్య, పలి వీరస్వామి, పులి సాంబయ్య, నల్లతీగల రవి, అప్పాల కవిత, గుండేటి లవకుమార్, ఇప్పకాయల మనోహర్, ఆలయ పూజారి అప్పు నాగేంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాద మృతుడి అంత్యక్రియలు



రోదిస్తున్న మృతుడి కుటుంబీకులు, బంధువులు

పర్వతగిరి : విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన భూక్య రవి అంత్యక్రియలు పోలీసుల భారీ బందోబస్తు మధ్య మంగళవారం నిర్వహించారు. వంద మందికిపైగా పోలీసుల పహారా నడుమ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. మండలంలోని మోత్యతండాకు చెందిన భూక్య రవి, రాయపర్తి మండలం గట్టికల్లు శివారు జగన్నాథపల్లి కొత్త తండాకు చెందిన గుగులోత్ దేవేందర్, తొర్రూరు మండలం జమస్తాన్‌పురం గ్రామం సుందర్‌నాయక్ తండాకు చెందిన బానోత్ సునీల్ సోమవారం విద్యుత్ ప్రమాదంలో మృతి చెందారు. భూక్యా రవి కుమారుడు జశ్వంత్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. కాగా, భూక్యా రవి అంత్యక్రియలు మోత్యతండాలో జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తుగా మోహరించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఎంజీఎం ఆస్పత్రిలో రవి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. రవి అంత్యక్రియల్లో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు. కాగా, మృతుడు రవి అన్న భూక్య వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గుగులోత్ వెంకన్న తెలిపారు. కాగా, భూక్యా రవి కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మంగళవారం రాత్రి పరామర్శించారు.

'ఎస్సైని మాట్లాడుతున్నానంటే నమ్మొద్దు'

ఐనవోలు : తాను ఐనవోలు ఎస్సై అని చెప్పుతూ ఓ అపరిచిత వ్యక్తి ఫోన్లు చేస్తున్నాడని, అలాంటి ఫోన్‌కు మండల ప్రజలు స్పందించొద్దని ఎస్సై గైకడి అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెల్ నంబర్ 8333934077 నుంచి నుంచి ఫోన్ కాల్ చేసి ఎస్సై అని చెప్పి డబ్బులు అడుగుతున్నట్లు సమాచారం వచ్చిందని పేర్కొన్నారు. సదరు నంబర్ నుంచి ఫోన్ వస్తే స్పందించొద్దని స్పష్టం చేశారు. ఎవరికీ డబ్బులు పంపించొద్దని కోరారు. ప్రస్తుతం ఐనవోలు ఎస్సై నంబర్ 8712685244 అని తెలిపారు. సైబర్ నేరాలకు గురైన బాధితులు టోల్ ఫ్రీ నంబర్ 1930ను సంప్రదించాలని కోరారు. ప్రజల నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానితుల వివరాలను పోలీసులకు అందించి నేరాల నివారణకు సహకరించాలని సూచించారు.

గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు

ఆత్మకూరు : గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సంతోష్ తెలిపారు. మండలంలోని పెంచికలపేట శివారులోని గుడుంబా స్థావరాలపై పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దాడుల్లో సుమారు 1200 లీటర్ల గుడుంబా పానకాన్ని ధ్వంసం చేయడంతోపాటు 46 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్న నేపథ్యంనల్లబెల్లి మండలంలోని నందిగామ గ్రామానికి చెందిన ఇస్లావత్ సుకాంత్, ఇస్లావత్ కల్పనలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. మండలంలో ఎవరైనా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుడుంబా నిర్మూలనలో ప్రజలు సహకరించాలని కోరారు. గుడుంబా స్థావరాలపై దాడుల్లో ఎస్సై రాజేశ్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.